క్లుప్తంగా

ఆదిత్యున్ని దర్శించుకున్న ఆర్టీసీ బోర్డు డైరెక్టర్



రాజారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో, ప్రధానార్చకులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనివేటి మండపంలో వేదాశీర్వచనాన్ని, ఆదిత్యుని జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ పీఆర్వో శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం సాయంత్రం ధర్మపథంలో భాగంగా విశాఖకు చెందిన కళారాధన డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల సమక్షంలో అనివేటి మండపంలో కళారాధన అకాడమీ ప్రతినిధి తాళ్లపాక సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో నృత్యకారులు భక్తి గీతాలాపనతో పాటు నాట్యం చేసి అలరించారు. అనంతరం కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాట్యగురువు డాక్టర్ నీరజ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బృందావనంలో అష్టమి వేడుకలు



భజన చేస్తున్న భక్తులు

గార: మండలంలోని జొన్నలపాడు కాలనీ సమీపంలో బృందావనంలో బహుళ అష్టమి సందర్భంగా ఆదివారం శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చౌదరి దుర్గారావు దంపతులు తొలిపూజ చేయగా పలువురు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సతీష్ బృందం భజన, యోగమాత అరుణ అనుగ్రహభాషణ చేశారు. బరాటం సంతోష్, సింహాద్రి శ్రీనివాసరావు, చౌదరి శ్రీనివాస్‌లు భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో అంబటి చక్రధర రావు, బలివాడ మోహనరావు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ఊరూరా హరిత వనాలు



వరిసాంలో మొక్కలు నాటుతున్న హరిత సొసైటీ సభ్యులు

రణస్థలం: మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరోగ్య అవసరాల కోసం ఊరూరా హరిత వనాలు చేయాలని హరిత సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. మండలంలోని వరిసాంలో చిల్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్పస్వాములు మొక్కలు నాటి రక్షణ కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. పుట్టిన రోజు, ఇతర శుభకార్యాలయాల సమయంలో పాఠశాల, ఆలయాల ఆవరణ, ఇతర ప్రాంతాల్లో మొక్కలు నాటాలనుకుంటే హరిత సొసైటీ(88853 28194)ను సంప్రదించాలని సంస్థ కార్యదర్శి సాడి రమణ కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కె.మనోజ్ కుమార్, చనమల్లు రవి, పిషిని రమణ పాల్గొన్నారు.

నేషనల్ గేమ్స్ అంపైర్‌గా బాడాన



బాడాన నారాయణరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక నేషనల్ గేమ్స్‌కు జిల్లా నుంచి ఏకైక అంపైర్‌గా ఫిజికల్ డైరెక్టర్ బాడాన నారాయణరావు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి గత నెలలో నియామక ఉత్తర్వులు అందుకున్న నారాయణరావు గత నెల 29 నుంచి గోవా వేదికగా జరుగుతున్న 37వ నేషనల్స్ గేమ్స్‌లో అథ్లెటిక్స్ క్రీడాంశంలో పోటీల నిర్వహణకు అంపైర్ (టెక్నికల్ అఫీషియల్)గా నియమితులైన విషయం తెలిసిందే. ఈయన టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీహెచ్ స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. జిల్లా పీడీ, పీఈటీ అసోసియేషన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌లో కీలకపాత్ర పోషిస్తూ జిల్లా రగ్బీ, నెట్‌బాల్, ఖోఖో తదితర క్రీడా సంఘాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.

నిర్భయంగా నిర్మాణాలు

- ఇరుకు వీధుల్లో ఇళ్ల నిర్మాణదారులకు ఊరట
- పది అడుగుల రోడ్డు ఉన్నా ప్లాన్ మంజూరుకు అవకాశం
- మంత్రి ధర్మాన చొరవతో అమల్లోకి 'సర్క్యులేషన్ పేట్రన్'
- నెరవేరనున్న సామాన్య, మధ్య తరగతి ప్రజల సొంతింటి కల



శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సొంతిల్లు.. ఎంతో మంది పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజల కల. చాలామందికి అది నెరవేరకుండానే కాలం గడిచిపోతుంది. ముఖ్యంగా శ్రీకాకుళం కార్పొరేషన్ వంటి నగరాల పరిధిలో సొంత ఇల్లు కట్టుకోవడం అంటే వ్యయప్రయాసలకు గురికావాల్సి వచ్చేది. నిబంధనలు పాటించడం లేదంటూ ఎంతో ప్రేమతో కట్టుకున్న ఇంటిని కళ్లముందే కూల్చేయడం, ప్లాన్ అప్రూవల్ రాకపోవడం తదితర కారణాలు ఇబ్బంది పెట్టేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. సామాన్యుల సొంతింటి కలను నెరవేర్చడమే ధ్యేయంగా రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సర్క్యులేషన్ పేట్రన్ అనే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా..

నగరంలో ఇరుకు వీధుల్లో ఇల్లు కట్టుకునేందుకు నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. ఈ విషయాన్ని మునిసిపల్ లైసెన్స్‌డు ఇంజినీర్ల సంఘాల ప్రతినిధులు మంత్రి ధర్మాన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విషయం వివరించారు. స్పందించిన ముఖ్యమంత్రి మున్సిపల్ డిపార్ట్‌మెంట్(అమరావతి) నుంచి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ద్వారా మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులను సమన్వయపరిచి, రాష్ట్రంలోనే ఇంతవరకూ ఎక్కడా అమలుకు నోచుకోని జీఓ ఎంఎస్ నెం.223- ఎంఎ, యూడీ 2018లో రూల్ 53 (1) సబ్‌రూల్ (2) అమలయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ జీవోను శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో తొలిసారిగా అమలయ్యేలా మంత్రి ధర్మాన చొరవ తీసుకున్నారు.

రోడ్డు అవరోధం తప్పినట్లే..

ఇదివరకు ప్రజలు ఇంటి ప్లాన్ పెట్టుకుంటే రోడ్డు నిబంధనల కారణంగా లక్షలాది రూపాయల విలువైన స్థలాన్ని కోల్పోయేవారు. నగర పరిధిలో ఇల్లు నిర్మించాలంటే వీధిలో కనీసం 30 అడుగుల రోడ్డు ఉండాలి. ఒక వేళ అక్కడ 10 అడుగులు మాత్రం ఉంటే.. ఇరువైపులా ఉన్న వారు చెరో పది అడుగుల స్థలం ఖాళీ ఉంచాలి. ఒకవేళ 20 అడుగుల స్థలం మాత్రమే ఉంటే అందులో 10 అడుగులు విడిచి పెట్టాల్సి ఉండేది. దీంతో మిగిలిన 10 అడుగుల్లో ఇల్లు కట్టుకోలేక, ఖాళీగా వదిలేయలేక తీవ్రంగా నష్టపోయేవారు. ఈ పరిస్థితి నుంచి సామాన్యులకు విముక్తి కల్పించేందుకు సర్క్యులేషన్ ప్యాట్రన్ విధానం అమల్లోకి తీసుకొచ్చారు. రోడ్డు నిబంధనను కనీసం పది అడుగులకు తీసుకొచ్చారు. దీనికి అనుగుణంగానే ప్లాన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

సర్క్యులేషన్ ప్యాట్రన్ అప్రూవల్ ప్రాంతాలివే..

శ్రీకాకుళం నగరంలో సర్క్యులేషన్ ప్యాట్రన్‌ను తొలి దశలో 25 ప్రాంతాల్లో అమలుచేసేందుకు నిర్ణయించారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా పరిస్థితులకు అనుగుణంగా అనుమతులు మంజూరు చేస్తామని టౌన్‌ప్లానింగ్ అధికారులు చెబుతున్నారు. 1.ఆదివారం పేట, 2.బొందిలీపురం, 3.సానావీధి, కుమ్మర వీధి, 4.బలగ పెద్దవీధి, బలగ మెట్టు, సాధు వీధి, హరేరామ కాలనీ, కుమ్మర వీధి, రజక వీధి, బందారు వీధి 5.గారవీధి(రజక వీధి, బర్మా కాలనీ, దూది వారి వీధి) 6.ఇప్పిలివీధి, 7.నానుబాల వీధి (కానుకుర్తి వారి వీధి), పుణ్యపు వీధి, పాండురంగ వీధి, రాచకట్లవారి వీధి, భూపాల్ రావు వీధి, 8.బాదుర్లపేట(కొత్తపేట), 9.ఎస్సీ కాలనీ(మాడూరివీధి), సంతోషిమాత కోవెల నుంచి జిల్లా పరిషత్ వరకు కలెక్టర్ బంగ్లా రోడ్డునకు పడమర దిక్కు భాగం, 10.బాలయ్యపేట, 11.అరసవిల్లి బ్రాహ్మణ వీధి(సెగిడివీధి), 12.అరసవెల్లి వెలమవీధి, 13.గుడి వీధి, 14.దమ్మలవీధి భాగం, 15.దమ్మల వీధి, 16.మంగువారితోట, 17.కంపోస్ట్ కాలనీ, 18.హయాతినగరం, 19.కాకి వీధి, 20.గుజరాతి పేట, గొల్లవీధి, 21.ఫాజుల్‌భాగ్‌పేట, 22.సీపాన్నాయుడుపేట, 23.కెల్ల వీధి, తెప్పలవీధి, తురాయి చెట్టు వీధి, మహిళా మండల వీధి, వైష్ణవ వీధి, పెద్దరెల్లి వీధి, పాలకొండ రోడ్డు పడమర భాగం, 24.బాకర్‌సాహెబ్‌పేట, రెడ్డిక వీధి, కర్రావీధి, 25.అనంతపల్లి వారి వీధి, పసగాడు వారి లేను, బలభద్రుని వారివీధి, నాయీ బ్రాహ్మణ వీధి, చేపల వీధి, చిత్తరంజన్ వీధి.

గతంలో ఇదీ పరిస్థితి..

ఉదాహరణకు 10 అడుగుల వెడల్పు గల రోడ్డులో ఇంటి ప్లాను అనుమతి రావాలంటే 30 అడుగుల రోడ్డు నిబంధన ప్రకారం యజమాని తన స్థలం పొడవులో 10 అడుగుల స్థలాన్ని మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉచితంగా ఇవ్వాల్సి వచ్చేది. 40 అడుగుల వెడల్పు స్థలం ఉం సుమారు 44.4 చదరపు గజాల స్థలం(ఇప్పుడున్న రేట్ల ప్రకారం సుమారు రూ.18 లక్షలు) నష్టపోయేవాడు. అలాగే 20 అడుగులు వెడల్పు స్థలమున్న యజమాని అయితే సుమారు రూ.9లక్షల విలువైన స్థలాన్ని మున్సిపాలిటీకి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చి నష్టపోవాల్సి వచ్చేది. కేవలం పది అడుగులే వెడల్పు ఉన్న స్థల యజమాని కూడా ఐదారు లక్షలు నష్టపోయేవారు. ఇక, ప్లాన్ అప్రూవల్ లేకపోతే బ్యాంకు రుణం వచ్చేది కాదు. బ్యాంకు రుణం రాకపోతే అప్పులు చేసి ప్లాను లేకుండా అక్రమ నిర్మాణంగా కట్టుకోవాల్సి వచ్చేది. ఇదే అదనుగా కొందరు బెదిరింపు రాయుళ్లు రంగంలోకి దిగేవారు. అక్రమ నిబంధనలపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశామని, తమకు డబ్బులు చెల్లిస్తే తాము చూసుకుంటామంటూ నిర్మాణదారులను ఇబ్బందులకు గురిచేసేవారు. వీరి మాట వినకుంటే మున్సిపల్ సిబ్బందితో కూల్చి వేసేవారు. వీటన్నింటికీ చెక్ పెట్టేలా సర్క్యులేషన్ ప్యాట్రన్ అమల్లోకి తీసుకొచ్చారు. నిర్భయంగా తమ స్థలంలో మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా ప్లాన్ తెచ్చుకుని సొంత ఇల్లు నిర్మించుకోవచ్చు.

శ్రీకాకుళమే ఫస్ట్..



సర్క్యులేషన్ ప్యాట్రన్ అమల్లోకి రావడం వల్ల సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఇంటి నిర్మాణాలు సులువుగా చేసుకోవచ్చు. కార్పొరేషన్ కూడా ఆదాయం పెరుగుతుంది. నగరంలో నిర్మాణాలు పెరిగి అభివృద్ధి జరుగుతుంది. నిర్మాణదారులంతా ప్లాన్‌కు దరఖాస్తు చేసుకునేలా ఎటువంటి అక్రమ నిర్మాణాలకు అవకాశం లేకుండా చేశాం. మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ చొరవచూపడంతోనే ఇది సాధ్యమైంది. రాష్ట్రంలోనే సర్క్యులేషన్ పేట్రన్ అమలైన తొలి కార్పొరేషన్ శ్రీకాకుళమే.

– చల్ల ఓబులేసు, నగరపాలక కమిషనర్, శ్రీకాకుళం

మంత్రి కృషి వల్లే..



నగరంలో చిన్నచిన్న రోడ్డు ఉన్న ప్రాంతాల్లో నిర్మాణాలు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారు. సర్క్యులేషన్ ప్యాట్రన్ రావడంతో ప్రతి ఒక్కరు ప్లాన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చింది. నిర్భయంగా నిర్మాణాలు చేసుకోవచ్చు. చిన్న స్థలం ఉన్న వారు కూడా ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావుకు నగరవాసులంతా రుణపడి ఉంటారు.

– బమ్మిడి కిషోర్, ఆదివారంపేట

నెరవేరిన చిరకాల కోరిక..



మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో చిరకాల కోరిక తీరింది. గతంలో జీవో 119 ప్రకారం ప్రతి రోడ్డు 30 అడుగులు రోడ్డు ఉంటేనే ప్లాన్ అప్రూవల్ ఇచ్చేవారు. తాజాగా సర్క్యులేషన్ ప్యాట్రన్ ప్రకారం భౌగోళిక, జీవనప్రమాణాలు అనుగుణంగా ప్లాన్ అనుమతులు వస్తుండటం సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఊరటనిచ్చింది. బ్యాంకు రుణాలకు అవకాశం కల్పించి ఇంటి నిర్మాణాల కల నెరవేరేందుకు సాకారమైంది.

– హారికా ప్రసాద్, ఎల్‌టీపీ అండ్ కన్సల్టింగ్ ఇంజనీర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

సర్క్యులేషన్ ప్యాట్రన్‌తో మేలు..



నగర అభివృద్ధికి సర్క్యులేషన్ ప్యాట్రన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. 10 అడుగుల రోడ్డుకు అవకాశం కల్పించడంతో ప్లాన్‌లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించవచ్చు. దీంతో కార్పొరేషన్ ఆదాయం పెరుగుతుంది. ఇంటి నిర్మాణం చేయదలచుకునేవారు ధైర్యంగా ముందడుగు వేయవచ్చు. నిర్మాణదారులపై నిఘాపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తున్న వారిని ఇక చెక్ పెట్టవచ్చు.

– ముని శ్రీనివాస్, లైసెన్స్‌డు ఇంజినీర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, శ్రీకాకుళం

ప్రత్యేక ఓటర్ల డ్రైవ్ విజయవంతం



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న సహాయ రిటర్నింగ్ ఎన్నికల అధికారి రమణమూర్తి



రణస్థలం: జె.ఆర్.పురంలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎన్నికల నమోదు అధికారి పద్మావతి



శ్రీకాకుళం రూరల్: పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అధికారులు



ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలో ఓటర్ల నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న తహశీల్దార్ సత్యనారాయణ



జి.సిగడాం: ఆనందపురంలో ఓటర్ల నమోదు పత్రాలను పరిశీలిస్తున్న వేణుగోపాలరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని 139 పోలింగ్ కేంద్రాల్లో శని,ఆదివారాల్లో నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక డ్రైవ్ విజయవంతమైందని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి అన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలో పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో 1,41,762 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల సంబంధించి ఓటర్ల జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 9 వరకు కొత్త ఓటర్ల నమోదు జరుగుతుందని, జనవరి 5న తుది జాబితా తయారవుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటర్లుగా నమోదు కావాలన్నారు.

రణస్థలం: ఓట్ల తొలగింపు, చేర్పులు, మార్పుల వంటి అభ్యంతరాలు స్వీకరణకు డిసెంబర్ 9 వరకు గడువు ఉందని ఎచ్చెర్ల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి బి.పద్మావతి తెలిపారు. జె.ఆర్.పురం 191, 192 పోలింగ్ బూత్‌ల్లో ప్రత్యేక ఓటర్ల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గం వ్యాప్తంగా 309 పోలింగ్ కేంద్రాల్లో 2,39,475 మంది ఓటర్లు ఉండగా, ఈ రెండు రోజుల్లో 858 మంది కొత్త వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. మార్పులు, చేర్పులకు 1828 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రతి సోమవారం గ్రామస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు, మంగళవారం మండల స్థాయిలో ఎన్నికల అధికారులు అందుబాటులో ఉంటారని, అడ్రస్‌లో మార్పులు, మరణాల తొలగింపు వంటి ప్రక్రియలు చేపడతారని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, వీఆర్వో లుకలాపు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మండలం యూనిట్‌గా 90 పోలింగ్ కేంద్రాల్లో పారదర్శకంగా ఓటరు జాబితాలు రూపొందిస్తున్నట్లు తహశీల్దార్ టి.సత్యనారాయణ చెప్పారు. అల్లినగరం, చిలకపాలెం, కుశాలపురం గ్రామాల్లో ఓటర్లు జాబితా ప్రత్యేక డ్రైవ్‌ను పరిశీలించారు.

జి.సిగడాం: బీఎల్‌ఓలు సమర్థంగా పనిచేసి పారదర్శక ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని మండల అసిస్టెంట్ రిట్నరింగ్ అధికారి పప్పల వేణుగోపాలరావు సూచించారు. ఆనందపురం, సంతవురిటి, మెట్టవలస పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్రరావు, బీఎల్‌ఓలు జయరాం, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: మండలంలోని కరజాడ, బైరి గ్రామాల్లో 276, 277, 278, 279 పోలింగ్ బూత్‌లను ఆర్‌డీఓ సీహెచ్ రంగయ్య, తహశీల్దార్ ఎస్.వెంకటరావు పరిశీలించారు. దరఖాస్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

క్రమశిక్షణతోనే గుర్తింపు



స్వీటీకి జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రమశిక్షణతో మెలిగితే గౌరవం, గుర్తింపు లభిస్తుందని 'మా మాస్టర్స్' అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి అన్నారు. మలేషియాలోని కౌలాలంపూర్ వేదికగా సెప్టెంబర్ 16, 17 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించిన ఎం.స్వీటీకి ఆదివారం సత్కరించారు. శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మైదానం జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి రూ.5వేలు నగదు అందించారు. అనంతరం డిసెంబరు 9,10 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా అథ్లెట్స్ సన్నద్ధత, ఎంపికల నిర్వహణపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా మా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు ఎండీ కాసింఖాన్, కళావతి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డి, ఎండీ రజియ, మహ్మద్ రఫీ, ఎం.వి.రమణ, జి.రవీంద్రకుమార్, ఎం.రామారావు, జి.జగన్నాథం, టి.గోవిందరావు, కె.సింహాచలం, సీహెచ్ గణేష్, డి.వీర్రాజు, శిల్లా రమాదేవి, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా 'తెరవే' సాహితీ సమ్మేళనం



కవి సమ్మేళనంలో తెరవే సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో ఆదివారం 86వ నెలవారీ సాహితీ సమ్మేళనం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో 15 మంది కవులు తమ కవితలు చదివారు. ప్రముఖ రచయిత, కవి బగాది వెంకటరావు వచన కవిత్వం–అభివ్యక్తి అనే అంశంపై చేసిన సాహితీ ప్రసంగం ఆకట్టుకుంది. కార్యక్రమంలో కవులు తెప్పల కృష్ణమూర్తి, నిక్కు హరిసత్యనారాయణ, గుడిమెట్ల గోపాలకృష్ణ, తంగి యర్రమ్మ, బి.జగన్నాథరావు, ఐఎన్‌డీ ప్రసాద్, తోట గోపాలరావు, వావిలపల్లి రాజారావు, ఇద్దిపాపయ్య, ఎస్.ఈశ్వరరావు, లక్ష్మీకర్ పట్నాయిక్, టి.జోగారావు పాల్గొన్నారు.

ధర్మాన్ని ఆచరించాలి



నారాయణమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యవాక్పరిపాలనే రాముని కర్తవ్యమని సనపల నారాయణమూర్తి అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న వాల్మీకి జయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీరామ – జాబాలిల ధర్మ సంవాదంపై ఆదివారం ప్రసంగించారు. అనంతరం వక్తను సత్కరించారు. కార్యక్రమంలో రంగడు ప్రసాదరావు, నిష్టల నర్సింహమూర్తి, భాస్కరరావు, ఎం.శ్రీనివాసరావు, రమ్య, కల్యాణి, సరస్వతి, బాబూరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ శాఖలో పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసన్న

శ్రీకాకుళం/శ్రీకాకుళం న్యూకాలనీ: గిరిజన సంక్షేమ శాఖలో స్కూల్ అసిస్టెంట్, పీజీహెచ్‌ల ప్రమోషన్లు చేపట్టాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరి ప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల గున్నంనాయుడు, రాజశేఖర్, రమణమూర్తి, పార్వతీశం, రమణ పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిరంలో భజనలు



జగన్నాథ మందిరంలో స్వామి

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి ఒడ్డున ఉన్న ఇస్కాన్ జగన్నాథ మందిరంలో మురళీధర్ ప్రభు ఆధ్వర్యంలో ఆదివారం భజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భగవద్గీత ప్రవచనం సాగింది. అనంతరం హారతి ఇచ్చారు. 300 మంది భక్తులకు ప్రసాద వితరణ గావించారు.

ఎమ్మెల్యే పరామర్శ



చిరంజీవి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్

రణస్థలం: మండలంలో తెప్పలవలసకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు యాగాటి అప్పయ్య కుమారుడు రామప్పడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు. వల్లభరావుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గురాన చిరంజీవి చిన్నాన్న ఇటీవల మరణించడంతో ఆయన కుటుంబాన్ని కూడా పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు గురాన మానస, నాయకులు బొమ్మలాట శ్రీరాములు, దన్నాన హరి, కొయ్యి సోములరెడ్డి, మహంతి సత్యనారాయణ, దన్నాన శ్రీనివాసరావు, కీర్తి మంగ, గడి బాబూరావు, పి.బుజ్జి పాల్గొన్నారు.